


# చివరి 20 నిమిషాలు కన్నీళ్లు ఆగలేదు..

'ఈ స్టేజ్‌పై విజయశాంతిగారు మాట్లాడుతుంటే నాన్నగారు లేని లోటు తీరిపోయింది. హీరోలకు ధీటైనా కథానాయిక ఈ దేశంలో విజయశాంతిగారు మాత్రమే. 'కర్తవ్యం'లోని వైజయంతి పాత్రకు కొడుకు పుడితే ఎలా ఉంటుందో అదే ఈ కథ. ఈ సినిమా చూశాను. విజయశాంతిగారు లేకపోతే సినిమా లేదు. పనిచేసిన వారంతా ప్రాణం పెట్టారు. సినిమా ఆఖరి 20 నిమిషాలు గుండె పిండేసింది. చూస్తున్న నాకే కన్నీళ్లు ఆగలేదు. ఆ 20 నిమిషాలు అలా రావడానికి కారణం మా అన్నయ్య కల్యాణ్‌రామ్. ఆయన కెరీర్‌లో ఈ సినిమా స్పెషల్‌గా నిలిచిపోతుంది.' అని అగ్ర హీరో ఎన్టీఆర్ అన్నారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. విజయశాంతి కీలక పాత్ర పోషించారు. సాయి మంజ్రేకర్ కథానాయిక. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ఈ నెల 18న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో తారక్ మాట్లాడారు. ఇది థియేటర్ నుంచి బయటకు రాగానే మరిచిపోయే సినిమా కాదు. రోజుల తరబడి గుర్తుండిపోయే సినిమా అని హీరో కల్యాణ్‌రామ్ అన్నారు. అగ్ర నటి విజయశాంతి మాట్లాడుతూ 'ఇది అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ మూవీ. ఓ తల్లి పడే ఆరాటం.. కొడుకు చేసే పోరాటం.. తల్లీకొడుకుల మధ్య జరిగే యుద్ధం ఈ సినిమా. నిర్మాణంలో ఉండగానే ఈ సినిమాపై పాజిటీవ్ వైబ్స్ ఉన్నాయి. అనుకున్నట్టే పెద్ద హిట్ అవుతుందని నమ్మకంతో ఉన్నాం.' అని నమ్మకం వెలిబుచ్చారు.



# నేను దెయ్యాన్ని కాదు.. భయపడకండి..

పానిండియా స్థాయిలో సూపర్‌స్టార్‌డమ్‌ని ఎంజాయ్ చేస్తున్నది కన్నడ భామ రష్మిక మందన్నా. ప్రస్తుతం ఆమె చేతిలో అరడజనుకు పైగా సినిమాలున్నాయి. ఆచితూచి సినిమాలను ఎంచుకుంటూ అన్నీ భాషలనూ కవర్ చేసేస్తున్నది రష్మిక. ఆమె సినిమాల జాబితాను పరిశీలిస్తే.. వాటిలో ఆసక్తికరమైన సినిమా ఒకటుంది. ఆ సినిమానే 'థామా'. రష్మిక నటిస్తున్న తొలి హారర్ కామెడీ సినిమా ఇది. ఆదిత్య సర్పోత్థార్ దర్శకుడు. దినేష్ విజన్ హారర్ ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సినిమా ఇది. ఈ సినిమాలో రష్మిక పాత్ర గురించి బాలీవుడ్ మీడియాలో ఆసక్తికరమైన కథనాలు వినిపిస్తున్నాయి. ఇందులో ఆమె పాత్ర ఏ రీతిలో ఉంటుంది? ఆహార్యం ఎలా ఉంటుంది? అనే విషయాలపై చర్చలు నడుస్తున్నాయి. రష్మిక రిస్క్ తీసుకుంటుందా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో తన తాజా ఇంటర్వ్యూలో 'థామా'లోని తన పాత్ర గురించి మాట్లాడింది రష్మిక. 'రీసెంట్‌గా నైట్ షూట్ సన్నివేశాల్లో నటించాను. నా కెరీర్‌లో ఈ తరహా సినిమా చేయడం ప్రథమం. ఇందులో దెయ్యాన్ని నేనేనంటూ చాలామంది విడుదలకు ముందే భయపడుతున్నారు. కథనాలు కూడా వచ్చేస్తున్నాయ్. ఇందులో నేను భయపడేదాన్నే కానీ, భయపెట్టేదాన్ని కాదు.' అంటూ అందంగా నవ్వేసింది రష్మిక.




నటుడు ప్రియదర్శి ప్రధాన పాత్రధారిగా రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్టైనర్ 'సారంగపాణి జాతకం'. రూప కొడువాయూర్ కథానాయిక. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకుడు. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈచిత్రం ఈ నెల 25న సమ్మర్ స్పెషల్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'పూర్తిస్థాయి వినోదభరితమైన

# సారంగపాణి రాక అప్పడే..

సినిమా తీయాలనే నా కోరిక ఈ సినిమాతో తీరింది. ప్రేక్షకులకు రెట్టింపు వినోదాన్ని అందిస్తుందీ సినిమా. తొలుత ఈ నెల 18న సినిమాను విడుదల చేయాలనుకున్నాం. కానీ కొన్ని కారణాల దృష్ట్యా 25కి వాయిదా వేశాం. ఇంద్రగంటి మోహనకృష్ణ టేకింగ్, ప్రియదర్శి యాక్టింగ్ ఈ సినిమాకు హైలైట్స్. మా శ్రీదేవీ మూవీస్ సంస్థ పేరు ప్రఖ్యాతుల్ని నిలబెట్టే సినిమా అవుతుంది.' అని నమ్మకం వెలిబుచ్చారు. నరేష్, తనికెళ్ల భరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష, శివన్నారాయణ, అశోక్‌కుమార్, తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: పీజీ విందా, సంగీతం: వివేక్ సాగర్.

# ఆమె ఏం మాట్లాడినా కరెక్టే



బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్ నటించిన 'టాయిలెట్ ఏక్ ప్రేమ్‌కథ'(2017) సినిమా టైటిల్‌పై సీనియర్ నటి, రాజకీయ నాయకురాలు జయాబచ్చన్ ఇటీవల అసహనం వ్యక్తం చేశారు. 'ఆ టైటిల్ నాకేమాత్రం నచ్చలేదు.. ఆ పేరు చూడండి ఎలా పెట్టారో..' అంటూ కించపరిచేలా మాట్లాడారామె. అంతటితో ఆగకుండా.. 'ఇది సినిమా టైటిలా? దాన్ని టైటిల్ అంటారా? అలాంటి టైటిల్స్ ఉన్న సినిమాలను నేను చూడను' అంటూ నిర్మొహమాటంగా సెలవిచ్చారు జయా బచ్చన్. ఈ వ్యవహారంపై చిత్ర కథానాయకుడు అక్షయ్ మౌనం వహించగా, నిర్మాత ప్రేరణా అరోరా మాత్రం జయా మాటలకు కౌంటర్ ఇచ్చారు. 'ఎందుకా పేరు పెట్టాం? సినిమా ద్వారా మేమిచ్చిన సందేశం ఏంటి? అనేది సినిమా చూస్తే కదా తెలిసేది. ఆ సినిమాకు వచ్చిన వసూళ్ల గురించి ముందు తెలుసుకోండి. తర్వాత సినిమా చూసి అప్పుడు మాట్లాడండి మేడమ్..' అంటూ ఎటాక్ చేశారు ప్రేరణా అరోరా. అయితే.. రీసెంట్‌గా 'కేసరి చాప్టర్ 2' ప్రమోషన్‌లో పాల్గొన్న అక్షయ్.. జయా మాటలపై స్పందించారు. 'టాయిలెట్ ఏక్ ప్రేమ్‌కథ'పై ఆమె ఏం మాట్లాడారో నాకు తెలీదు.. కానీ ఆమె ఏం మాట్లాడినా కరెక్టే..' అంటూ నవ్వుతూ అక్షయ్ స్పందించారు. అక్షయ్ స్పందనలో వెటకారం ధ్వనిస్తున్నదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# మాట నిలబెట్టుకున్నాం



'సినిమా విడుదలకు ముందు ఫస్ట్ ఫ్రేమ్ నుంచి లాస్ట్ ఫ్రేమ్ వరకూ ప్రేక్షకుల పెదవులపై నవ్వు ఉంటుందని ప్రామిస్ చేశాను. ఆ ప్రామిస్‌ని నిలబెట్టుకున్నాం. థియేటర్లలో ఆడియన్స్ నవ్వులు మా కష్టాన్ని మరిపించాయి. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ విడుదల చేయడంతో మా సినిమాపై అంచనాలు పెరిగాయి. ఈ సినిమాకు అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. ఆ ఫలితం తెరపై కనిపిస్తున్నది. ఇంతటి విజయాన్నిచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని హీరో ప్రదీప్ మాచిరాజు పేర్కొన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. దీపిక పిల్లి కథానాయిక. డుయో నితిన్, భరత్ కలిసి దర్శకత్వం వహించారు. మాంక్స్ అండ్ మంకీస్ పతాకంపై రూపొందిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో ప్రదీప్ మాట్లాడారు. కష్టానికి తగ్గ ఫలితాన్నిచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలని దర్శకుడు అన్నారు. ఇంకా దీపిక పిల్లి, గెటప్ శ్రీను, సంగీత దర్శకుడు రధన్, మైత్రీ శశిధర్‌రెడ్డి కూడా మాట్లాడారు.

అక్కినేని అఖిల్ నటిస్తున్న చిత్రం 'లెనిన్'. మురళీకిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అఖిల్ పాత్ర గురించి ఆసక్తికరమైన విషయం తెలిసింది. ఇది రాయలసీమ నేపథ్యంలో కూడిన కథ అని అందరికీ తెలిసిందే. చిత్తూరు పరిసరాల్లో ఈ కథ సాగుతుందని సమాచారం. అయితే.. ఇందులో అఖిల్ పాత్ర నేపథ్యం ఎవరూ ఊహించని రీతిలో ఉంటుందట. సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకూ కమ్యూనిజానికి పొత్తు కుదరదు. ఇందులో హీరో పేరు లెనిన్.

# నెవర్ బిఫోర్ అనిపించేలా

ప్రపంచ ప్రఖ్యాత కమ్యూనిస్ట్ నాయకుడు పేరు అది. ఆ పేరుకూ, అతని ఆహార్యానికీ పొంతన లేకపోవడం గమనార్హం. నుదుటన బొట్టు.. పెరిగిన గడ్డం.. దేవుడి బొమ్మతో మెడలో వేళ్లాడే గొలుసు. ఇలా విభిన్నంగా అఖిల్ ఈ సినిమాలో కనిపిస్తున్నారు. అతని ఆహార్యానికీ, పేరుకీ.. సినిమా కథకూ ఊహించని సంబంధం ఉంటుందని తెలుస్తున్నది. అఖిల్ కెరీర్‌లోనే నెవర్ బిఫోర్ అనిపించేలా క్యారెక్టరైజేషన్ ఉంటుందట. శ్రీలీల ఇందులో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.



# శ్రీవాసు దర్శకత్వంలో?



హీరో సందీప్‌కిషన్ ఇటీవలే 'మజాకా' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన చేతిలో రెండుమూడు ప్రాజెక్టులున్నాయి. తమిళంలో కూడా సినిమాలు చేసున్నారాయన. రీసెంట్‌గా దర్శకుడు శ్రీవాసు ఆయనకు ఓ కథ వినిపించారట. సందీప్‌కి కూడా ఆ కథ నచ్చిందని ఫిల్మ్ వర్గాల సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన వివరాలు త్వరలో తెలియనున్నాయి. నిజానికి రవితేజ కోసం శ్రీవాసు ఈ కథ రాశారట. రవితేజ కూడా కథను ఓకే చేశారట. ఈ సినిమాను నిర్మించేందుకు ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ముందుకొచ్చిందట. కానీ ఎందుకో ఆ ప్రాజెక్ట్ నుంచి రవితేజ తప్పుకున్నట్టు సమాచారం.

# రామయ్య కీర్తన నోరారా పలుకగా..



'ఏ.. తయ్యతక్క తకధిమి చక్కభజనలాడి రాములోరి గొప్ప చెప్పుకుందామా.. ఆ సాములోరి పక్కనున్న సీతామాలచ్చిమమ్మ లక్షణాలు ముచ్చటించుకుందామా.. నీ గొంతు కలిపి.. మా వంత పాడగ రావయ్య అంజనీ హనుమా.. రామయ్య కీర్తన నోరార పలుకగ చిరంజీవి నీ జన్మ.. రామరామ రామ రామరామ..' శ్రీరాముడ్ని కీర్తిస్తూ 'విశ్వంభర' సినిమాలో చిరంజీవి పాడిన పాట ఇది. 'శ్రీరామనవమి' ఉత్సవాలను ప్రతిబింబిస్తూ దర్శకుడు వశిష్ట ఈ పాటను తెరకెక్కించారు. సీతారాముల గొప్పతనాన్ని తెలియజేస్తూ.. హనుమంతుడి అదృష్టాన్ని కొనియాడుతూ భావోద్వేగభరితంగా రామజోగయ్య శాస్త్రి పాటను రచించగా, ఎం.ఎం.కీరవాణి జనరంజకంగా స్వరపరిచారు. శంకర్‌మహదేవన్, లిప్సిక భక్తితో ఆలపించారు. చిరంజీవి తన్మయంతో ఆడిపాడారు. భారీ సెట్టింగులతో ఆధ్యాత్మిక సంప్రదాయాల సారాన్ని ఆవిష్కరించేలా ఈ పాటను చిత్రీకరించడం జరిగిందని, చిరంజీవి చరిస్మాటిక్ ప్రెజన్స్.. గ్రేస్‌ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ అభిమానులకు కన్నుల పండుగ చేయనున్నాయని, ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. త్రిష కృష్ణన్, అశికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: చోటా కె.నాయుడు, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మాణం: యూవీ క్రియేషన్స్.

# ఇరు కనులు కలిసి మురిసే..



రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో రూపేష్, ఆకాంక్షసింగ్ జంటగా నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. పవన్‌ప్రభ దర్శకుడు. ఈ చిత్రానికి మ్యూజిక్ మేస్ట్రో ఇళయరాజా సంగీతాన్నందిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమాలోని రెండో గీతాన్ని హీరో రవితేజ విడుదల చేశారు. 'ఇరు కనులు కలిసి మురిసె, మొదటి చూపులో, తొలి పిలుపు తగిలి మెరుపు మెరిసే మనసు నింగిలో..' అంటూ మనసును ఆకట్టుకునే భావాలతో ఈ పాట సాగింది. ఇళయరాజా బాణీకి గీత రచయిత రెహమాన్ సాహిత్యాన్నందించారు. ఎస్పీ చరణ్, విభావరి ఆలపించారు. కథానుగుణంగా వచ్చే చక్కటి యుగళగీతమిదని, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని సుందర లొకేషన్లలో చిత్రీకరించామని, తోట తరణి కళా దర్శకత్వం ఈ పాటకు కొత్తందాన్ని తీసుకొచ్చిందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాత: రూపేష్, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, దర్శకత్వం: పవన్‌చంద్ర.

# ఆ బాధ వర్ణనాతీతం



బాలీవుడ్ నటి నుస్రత్ బరుచా తన జీవితంలో ఎదురైన చేదు అనుభవాన్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నది. 2019లో వచ్చిన 'డ్రీమ్ గర్ల్' సినిమా ఈ బాలీవుడ్ భామకు గుర్తింపు తెచ్చిపెట్టింది. అదే టీమ్ ఆ సినిమాకి సీక్వెల్‌గా 2023లో 'డ్రీమ్‌గర్ల్ 2'ను తెరకెక్కించారు. తొలిపార్ట్‌లో నటించిన వారంతా ఈ సీక్వెల్‌లోనూ నటించారు. ఒక్క నుస్రత్ బరుచా తప్ప. ఇది తన జీవితంలో ఎదురైన చేదు అనుభవంగా ఆమె అభివర్ణించారు. దీనిపై ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ' మా టీమ్ నిర్ణయం నన్నెంతో బాధించింది. 'డ్రీమ్ గర్ల్'లో నటించిన అందర్నీ సీక్వెల్లో తీసుకున్నారు.. నన్ను తప్ప. నా బదులు అనన్య పాండేను తీసుకున్నారు. ఈ విషయాన్నే జీర్ణించుకోలేకపోయా. అలా అని నేనేం యుద్ధానికి దిగలేదు. ఎందుకంటే పోరాటం చేసినంత మాత్రాన పరిస్థితులు మారవు. ఒకవేళ నిలదీస్తే.. 'నువ్వు అవసరం లేదు' అనే సమాధానం వస్తే.. ఇక ఆ బాధ వర్ణనాతీతం. అయినా అది వారి సినిమా. వారి ఇష్టం. అందుకే ప్రశ్నించలేదు.' అంటూ వాపోయింది నుస్రత్.





